నంబర్ ప్లేట్ లేని వాహనాలపై నజర్ !

- పట్టుబడితే సీజ్ చేస్తున్న పోలీసులు
- మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసు నమోదు



నంబర్ లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్ : రోడ్డుపై వెళ్తున్న క్రమంలో ఆ వాహనం ఏదైనా ప్రమాదానికి గురై ఎవరైనా మృతిచెందితే.. ఆ వాహనానికి నంబర్ ప్లేట్ లేకుంటే.. ఇక ఆ మరణించిన వ్యక్తిని గుర్తించే వరకూ పోలీసులకు కంటి మీద కునుకు ఉండదు. నంబర్ లేని వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు మొకానికి ముసుగులు వేసి ఓ కాలనీలో చోరీకి పాల్పడి పరారైతే ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నా చోరీకి పాల్పడిన వారిని గుర్తించడం పోలీసులకు కష్టంగా మారుతుంది. ఇలాంటి ఘటనలు దృష్టిలో పెట్టుకుని జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు నంబర్ లేని వాహనాలపై నజర్ పెట్టి , ప్రత్యే డ్రైవ్ చేపట్టాలని ఆయా పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో జిల్లా వ్యాప్తంగా నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాటిని గుర్తించి సరైన పత్రాలు లేని వాటిని సీజ్ చేయడం పత్రాలు ఉండి నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోని వాహనాదారులకు జరిమానాలు విధించడం వంటి చర్యలకు పోలీసులు నడుం బిగించారు.

ప్రతి ఐదింటిలో ఒక బండికి..

జిల్లా వ్యాప్తంగా నడుస్తున్న ద్విచక్ర వాహనాల్లో ప్రతి ఐదింటిలో ఒక వాహనానికి నంబర్ లేకుండా తిరుగుతున్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. దీంతో నంబర్ లేకుండా తిరుగుతున్న వారు ఉద్దేశపూర్వకంగా నంబర్ ప్లేట్లను తొలగించి వాహనాలను నడుపుతున్నారా? లేక ఏదైనా నేరాలకు పాల్పడిన సమయంలో కాని, ఇటీవల పోలీసులు ఫొటోలు తీసి జరిమాన వేయడాన్ని తప్పించుకోవడానికి అలా చేస్తున్నారా..? అనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రతి రోజూ ఎక్కడో ఒక్క చోట పోలీసులు స్పెషల్ డ్రైవ్‌తో తనిఖీలు చేపట్టి నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు.నంబర్ లేకుండా తిరిగే వారిని నేరస్తులుగానే భావిస్తున్న పోలీసులు ప్రభుత్వ నిబంధనలు విరుద్ధంగా వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కాగా ఒక్క మిర్యాలగూడ పట్టణంలోని నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలోనే ఇటీవల కాలంలో 235 కేసులు నమోదు చేసిన పోలీసులు నంబర్ లేకుండా తిరిగే వాహనాలను విడిచి పెట్టేది లేదని వారు పేర్కొంటున్నారు.

నంబర్ లేకుంటే నేరస్తులే



వాహనాలకు నంబర్ లేకుండా నడిపే వారందరూ నేరస్తులుగానే భావించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హై సెక్యూరిటీ ప్లేట్ వాడితే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కొంత మంది ఉద్దేశపూర్వకంగా నంబర్ ప్లేట్ తొలగించడం, నంబర్ కనిపించకుండా చేసి వాహనాలను నడుపుతున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రైత్యేక డ్రైవ్ చేపట్టి వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– పి. వెంకటగిరి, డీఎస్పీ మిర్యాలగూడ

మైనర్ డ్రైవింగ్‌పై దృష్టి

ఇటీవల మైనర్ డ్రైవింగ్‌లు పెరిగి పోవడంతో పలు చోట్ల ప్రమాదాలు జరిగుతున్నాయి. దీంతో మైనర్ డ్రైవింగ్ చేసే వారిపై కూడా పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తుంది. డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్‌ల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తూ మైనర్లు డ్రైవింగ్ చేస్తే జరిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. రెండోసారి పట్టుబడితే ఆ వాహనాలను సీజ్ చేయడంతో పాటు వాహనం ఎవరి పేరుపై ఉందో వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన 93మందికి సీఎం సహాయనిధి నుండి మంజూరైన రూ.35.50లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు ఆపద సమయాల్లో నిరుపేదలను సీఎం సహాయనిధి ఆపన్నహస్తంలా ఆదుకుంటుందన్నారు. బడుగు, బలహీన అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేదల చెంతకు రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ్మ, జెడ్పీటీసీ మారుపాకుల అరుణ సురేష్‌గౌడ్, చింతపల్లి సుభాష్‌గౌడ్, టీవీఎన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, వేముల రాజు, శ్రీశైలం గౌడ్, బిక్కునాయక్ పాల్గొన్నారు.

గ్రామ్య స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

దేవరకొండ : గ్రామ్య స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం దేవరకొండ మండల పరిధిలోని గ్రామ్య స్వచ్ఛంద సంస్థ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు, మహిళల సంక్షేమం కోసం సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. బానిస బతుకులు మారాలంటే ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మారుపాకుల అరుణసురేష్‌గౌడ్, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, చింతపల్లి సుభాష్, ఆరెకంటి ముత్యాలమ్మరాములు, సంస్థ నిర్వాహకురాలు రుక్మిణీరావు, అనురాధ, లక్ష్మీ, కొప్ర గౌతమి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



యాదగిరిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

హాలియా : నల్లగొండ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన హాలియా పట్టణానికి చెందిన చిట్టిపోలు యాదగిరిని ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వీరమళ్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతులకు, వ్యాపారులకు వారధి పనిచేసి పలువురి మన్ననలు పొందాలని సూచించారు. సన్మానించిన వారిలో కొండూరి గణేష్, పాంపాటి శ్రీనివాస్, వెంపటి శంకరయ్య, చీదెళ్ల లింగయ్య, తేలపోలు శేఖర్, యాద ఈదయ్య, వీరమళ్ల కృష్ణయ్య, పూర వేణు, వెంపటి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వెంకన్న, సంతోష్, దేవేందర్, ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే నోముల భగత్



బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా : వేసవి కాలం సమీపిస్తుండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని మండలాల విద్యుత్‌శాఖ అధికారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భగత్ మాట్లాడుతూ ఏమైన సమస్య వచ్చినా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి నిరంతరం విద్యుత్‌ను అందించాలని సూచించారు.

చెక్కు అందజేత

హాలియా పట్టణంలోని పదో వార్డుకు చెందిన షేక్ ముస్తఫా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతడికి బీఆర్‌ఎస్ సభ్యత్వం కలిగి ఉండటంతో పార్టీ నుంచి మంజూరైన రూ. 2లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. అలాగే నల్లగొండ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వరుసగా రెండోసారి ఎన్నికైన చిట్టిపోలు యాదగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపల్ చైర్మన్ గౌరవ సలహాదారులు వెంపటి శంకరయ్య, పదో వార్డు ఇన్‌చార్జ్ బందిలి పెద సైదులు, మండల పార్టీ అధ్యక్షుడు కురాకుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, మార్కెట్ డైరెక్టర్ సురభి రాంబాబు, కో ఆప్షన్ మెంబర్ చాపల సైదులు, షేక్ అన్వరుద్దీన్, సైదాచారి పాల్గొన్నారు.

26న ఉచిత వైద్యశిబిరం

మిర్యాలగూడ అర్బన్ : ఈ నెల 26న ఇండియన్ మెడికల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు, పోలీసులు ఆరోగ్యం కోసం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మాధవ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం డీఎస్పీ పి.వెంకటగిరి ని కలిసిన వైద్యులు ఉచిత వైద్య శిబిరం వివరాలను, అందులో చేసే పరీక్షల వివరాలను తెలిపారు. వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తామని జర్నలిస్టులు, పోలీసు సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పద్మనాభరెడ్డి, శేఖర్‌రెడ్డి, మనోహర్, వెంకట్‌రెడ్డి తదిరులున్నారు.

గీతామందిరానికి సీసీ రోడ్డువేయాలి



అధ్వానంగా ఉన్న రహదారి

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పైలాన్‌కాలనీ పాత బస్టాండు నుండి నోబుల్‌స్కూల్ పక్కనుండి గీతామందిరం వరకు సీసీ రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. కాలిబాట కూడా సరీగా లేదని రాళ్లు, కంప చెట్లతో కూడిన డొంకబాట ఉందన్నారు. అధికారులు ఈ ప్రాంతాన్ని సందర్శించి ప్రజలతో పాటు భక్తులు గీతామందిరానికి వెళ్లేందుకు వీలుగా రోడ్డు సౌకర్యం కల్పించాలని మున్సిపాలిటీ కమిషనర్‌ను కోరారు. కమిషనర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఆ ఆప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం నిధులను బట్టీ రోడ్డు వేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హాలియా : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



మిర్యాలగూడ టౌన్ లో..

హాలియా : పట్టణంలోని ఆదర్శ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 1997–98 బ్యాచ్ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం నార్కట్‌పల్లి మండలంలోని వివేరా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ తమ చిన్న నాటి స్నేహితుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యా బుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలయ్య, కోటయ్య, వెంకటయ్య, నాతి శ్రీనివాస్, మహమ్మద్, షరీఫ్, చాపల శ్రీనివాస్, రావుల సైదులు, విద్యార్థులు వెంకన్న, సతీష్, కృష్ణ, రమేష్, పురుషోత్తమం, కొండల్, రాజు, సుజాత, పుష్పలత, జయసుధ, సత్యనారాయణ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : దామరచర్ల మండలం కొండ్రపోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–99వ సంవత్సరం పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం పట్టణంలోని వైష్ణవి గ్రాండ్స్‌లో ఆదివారం నిర్వహించారు. 23 ఏళ్ల తరువాత ఒకే వేదికపైకి వచ్చిన పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకొని ఆనందంలో మునిగితేలారు. అనంతరం గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, సుధాకర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కోటిరెడ్డిలతో పాటు పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న బీఎల్ఆర్

మిర్యాలగూడ : క్రీడల్లో గెలుపొటములు సహజమని వాటిని క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని ప్రముఖ సామాజికవేత్త, పట్టణ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ మండలం జంకుతండా గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేదలకు బీఎల్‌ఆర్, బంజార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథనాయక్‌లు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, కౌన్సిలర్ రవినాయక్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్‌రెడ్డి, చిన్న రాజు, ఇమ్రాన్, మౌలాన, వెంకటేశ్వర్లు, ఆర్గనైజర్లు దివాకర్, రఘుపతి, సోను, సత్తి, పవన్, చినా, నితిన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



ఇస్త్రీ పెట్టెలు అందజేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ టూటౌన్ : రజకుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం పెట్టపీట వేస్తోందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణానికి చెందిన 250 మంది రజక మహిళలకు ఎమ్మెల్యే ఇస్త్రీ పెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజక మహిళలు ఉపాధి పొందేందుకు ఇస్త్రీ పెట్టెలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకానలు అర్హులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, రజక సంఘం నాయకులు పగిళ్ల సైదులు, చెన్నయ్య, రాజు, సతీష్, రాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలి

నల్లగొండ టౌన్ : అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు, పల్లా దేవేందర్, నూనె రామస్వామి, వెంకటేశ్వర్లు, యాదయ్య, లెనిన్, బుచ్చయ్య, విష్ణు, సైదులు, అశోక్ , రమేష్, సాయి, వేణు, నగేష్, రవి, ముత్తయ్య పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

మర్రిగూడ : మండలంలోని అజ్జిలాపురం గ్రామంలో శ్రీ బుగ్గ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పూల రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మౌనిక హరీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దండెటక్కర్ అనసూయఅంజయ్య, ఆలయ మాజీ చైర్మన్ రామిడి వెంకటరమణరెడ్డి, మాజీ సర్పంచ్ లాలునాయక్, రామిడి సుజాత సత్తిరెడ్డి, పల్లె యాదగిరి, రామిడి మైపాల్‌రెడ్డి, ఉప్పునూతల వెంకటేష్, కాపర్తి అంజయ్య, ఉప్పునూతల మల్లేష్, మెగావత్ ధర్మానాయక్, మాదగోని వెంకటేష్, పుల్లయ్య, నర్సిరెడ్డి, సాయిరెడ్డి, వెంకటబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : అనారోగ్య సమస్యలతో వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 18 మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 6,38,500 విలువ గల చెక్కులను ఆదివారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి యావత్ దేశ ప్రజలందరూ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు.

ఆదర్శ రైతు మృతికి సంతాపం

నల్లగొండ టూటౌన్ : తిప్పర్తి మండలం బుసిరెడ్డి గూడెం మాజీ సర్పంచ్, ఆదర్శ రైతు బుసిరెడ్డి రాంరెడ్డి ఆదివారం మృతిచెందడంతో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సంతాపం తెలియజేశారు. రాంరెడ్డి ఆదర్శ రైతుగా రైతుల సంక్షేమానికి నిరంతర కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



దామరచర్లలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



హాలియాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు బాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామాలు చేయాలని దామరచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు దామరచర్ల మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సపావత్ హట్యానాయక్, వెంకట్వేర్లు, కొమ్ము దాసు, ఆకారపు గోపాల్, అల్లం నాగరాజు, పగిడి జీడయ్యయాదవ్, ఆడావత్ నాగునాయక్, భిక్షమాచారి, తాళ్లపల్లి విజయ్, వసంత్‌కుమార్, సదానందం, దావీదు, కోటేశ్వర్‌రావు, ఆనంద్‌నాయక్, శివ, మాజీద్, జగన్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారం తెలంగాణ ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనం అని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ అంకూరి శివ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల ఎంతో మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



వేములపల్లిలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హాలియా : టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు ఆదివారం హాలియా పట్టణంలో సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ 30లక్షల మంది నిరుద్యోగులకు సంబంధించిన పేపర్ లికేజీకి సంబంధించి సీఎం కేసీఆర్ నైతిక బాధ్యత వహిస్తూ సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, హాలియా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు భానుచందర్, శ్రీనివాస్, శ్రీను, అంజనేయులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న ప్రభుత్వం

వేములపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్ముడబోయిన అర్జున్, మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డిలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీని నిరసిస్తూ సీఎం కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, నాయకులు పుట్టల శ్రీనివాస్, సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, మధు, పెద్ద వెంకన్న, కొమ్ము వెంకన్న, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పల్లా వెంకన్న, దైద గిరి, జానయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

22 నుంచి కాంగ్రెస్ పాదయాత్ర

వేములపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపడుతున్న పాదయాత్రకు సంఘీభావంగా ఈనెల 22 నుంచి ఉమ్మడి మండల వ్యాప్తంగా మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టనున్నట్లు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర ఈనెల 22న మధ్యాహ్నం 3గంటలకు ఆమనగల్లు నుంచి ప్రారంభం కానుందని, ఈ యాత్రలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్‌ఆర్‌లు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అడవిదేవులపల్లి ఎస్‌గా హరిబాబు

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి ఎస్ఐగా వై. హరిబాబు ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ లక్ష్మణ్ హైదరాబాద్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నల్లగొండ స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐగా పని చేస్తున్న వై. హరిబాబు బదిలీపై ఇక్కడికి వచ్చాడు.

టూ టౌన్ సీఐగా నరసింహారావు



మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ టూ టౌన్ సీఐ గా ఏ.నరసింహారావు నియమితులయ్యారు. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నిగిడాల సురేశ్ గత నెల 27న సైబరాబాద్ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లగా డీసీఆర్‌బీ నాగర్‌కర్నూల్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న నరసింహారావు బదిలీపై రానున్నారు. త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

తాటి, ఈత చెట్లు నరికే వారిపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ అర్బన్ : తాటి, ఈత చెట్లను నరికే వారిపై చర్యలు తీసుకునే విధంగా చట్టం తెచ్చి జీఓ నంబర్ 560 అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చౌగాని సీతారాములు అన్నారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర మండలంలోని జప్తివీరప్పగూడెంకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూముల అభివృద్ధి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తాటి ఈత చెట్లను నరికి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీఓ నం 560 ప్రకారం ప్రతి గౌడ సొసైటీకి ఐదు ఎకరాల భూమి కేటాయించి, తాటి, ఈత, ఖర్జూర చెట్ల పెంపకం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కొండా వెంకన్న, నాయకులు లింగస్వామి, సత్తయ్య, సైదులు, ధనుంజయ, శ్రీనివాస్, వెంకట్‌గౌడ్, పుల్లయ్య, అచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్ష

దేవరకొండ : టీఎస్‌పీఎస్సీలో జరిగిన అక్రమాలకు నిరసనగా నేడు బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కల్యాణ్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

అరెస్టుపై గ్రామస్తుల ఆందోళన

కొండమల్లేపల్లి : మండలంలోని కొల్‌ముంతల పహాడ్‌లో అక్రమంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి అడ్డుపడినందుకు నెల్లికంటి గోపిని ఆదివారం కొండమల్లేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ప్రత్యేకంగా గోపి మీద కేసు పెట్టడంపై పోలీసులను ప్రశ్నించారు. ఈ విషయమై పోలీసులతో మాట్లాడి గోపిని విడిపించారు. ప్రజల మద్దతు లేకుండా చర్చికి పర్మిషన్ ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

నేడు నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన దీక్షలు

నల్లగొండ టూటౌన్ : టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, కారకులను కఠినంగా శిక్షించాలని, మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన దీక్ష నిర్వహించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పార్టీ నాయకులను కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డిండి : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ. సైదులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని వావిల్‌కొల్ గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసును తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.